క్లుప్తంగా

ప్యాపిలి చేరిన బాలరాముడి విగ్రహం

ప్యాపిలి: అయోధ్యలో రామాలయంలో ఏర్పాటు చేయనున్న బాలరాముడి విగ్రహం మంగళవారం ప్యాపిలికి చేరింది. అయోధ్య అభివృద్ధి సంస్థ అనుమతితో ఆళ్లగడ్డలో తయారైన ఈ విగ్రహాన్ని రామమందిరంలో ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు తిరుపతి, అనంతపురం, గుత్తి మీదుగా ప్యాపిలికి చేరిన విగ్రహానికి స్థానిక కొప్పు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పట్టణ ప్రజలు ఘన స్వాగతం పలికారు. విగ్రహ ఊరేగింపులో సరస్వతి శిశు మందిరం విద్యార్థుల కోలాటం ఆకట్టుకుంది.

ఈవీఎంలపై అవగాహన

బేతంచెర్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2024 సార్వత్రిక ఎన్నిలను దృష్టిలో ఉంచుకొని ఈవీఎంలతో ఓటు వేసే విధానంపై మాస్టర్ ట్రైనర్ దేవదాసు, సూపర్ వైజర్ గోవిందప్ప ఆధ్వర్యంలో బుధవారం సబ్ రిజిష్టర్ కార్యాలయం, నగర పంచాయతీ , హనుమాన్ నగర్ కాలనీల ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. అదేవిధంగా బుధవారం అంబాపురం, ఆర్ కొత్తపల్లె, రంగాపురం గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామని వారు తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న గుండం శేషిరెడ్డి

బనగానపల్లె : మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం గౌరిశంకర్ ఆధ్వర్యంలో మొక్కలునాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లి జన్మనిస్తే చెట్టు ఆరోగ్యాన్ని ఇస్తుందని, మొక్కల పెంపకం ప్రగతికి సోపానమన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ వెంకట్రాముడు జగదీశ్వర్‌రెడ్డి వంశీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సమీక్ష

కొలిమిగుండ్ల: అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ సాయికృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే మండలంలోని 50 అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టామన్నారు. రోజు మాదిరిగానే కేంద్రాలకు చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వాచ్‌మెన్ మృతి

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన గోపాజీ రామ మద్దిలేటి (39) ముదిగేడు ట్రాన్స్‌కో విద్యుత్ సబ్‌స్టేషన్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 16వ తేదీన అవుకునకు వ్యక్తిగత పనినిమిత్తం బైకుపై వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. శింగన పల్లె, ఆకుమల్ల గ్రామల మధ్యలో ప్రమావత్తుశాత్తు బైకుపైనుంచి కింద పడ్డాడు. చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కొలుకోలేక మంగళవారం మృతి చెందాడు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో జైలు శిక్ష

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి జైలు శిక్ష పడింది. మంగళవారం ఎస్‌ఐ వెంకటరెడ్డి సమాచారం మేరకు.. పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మన్న కుమారుడు నాగరాజు 2020 సంవత్సరంలో ఓ మహిళను వివాహం చేసుకున్నాడు. వివాహం తర్వాత భార్య, భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో బాధితురాలు కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్‌లో భర్తపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసింది. ఈ మేరకు స్థానిక కోర్టులో కేసు విచారణ జరిగి సాక్ష్యాలు రుజువు కావడంతో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రక్షణ చట్టం బిల్లును ప్రవేశ పెట్టాలి

బేతంచెర్ల: రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇంచార్జి ప్రభాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షాశావలి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీనివాసరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని మంగళవారం కోరారు. వారు మాట్లాడుతూ దేశంలో గత కొంత కాలంగా న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని తెలిపారు. మంత్రికి బుగ్గనకు వినతి ప్రతం సమర్పించారు.

గిరిజన భవనానికి స్థలం కేటాయించాలి

నియోజకవర్గ కేంద్రమైన డోన్ పట్టణంలో గిరిజన భవనానికి స్థలం కేటాయించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ రాగుల రాముడు, ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోపాలు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

వరాల దేవుడు మద్దిలేటయ్య!

- రేపటి నుంచి ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు
- ముస్తాబు అవుతున్న స్వామివారి ఆలయం
- నాటి కదిరి నరసింహుడే నేటి మద్దిలేటి నరసింహస్వామి



శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం (ఫైల్)

బేతంచెర్ల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 21 నుంచి 23 వరకు మూడు రోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారయంత్రాంగం సర్వం సిద్ధం చేస్తున్నారు. ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీ లక్ష్మి మద్దిలేటి నరసింహస్వామి భక్తుల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్నారు. కదిరి నరసింహస్వామి అంశగా భక్తుల కోరికలు తీర్చుతూ వరాల దేవుడిగా పూజలందుకుంటున్నారు. బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన మద్దిలేటయ్య క్షేత్రం దినాదినాభివృద్ధి చెందుతోంది. కోరిన కోరికలు నెరవేరడంతో భక్తులు తమ ఇంటి ఇలవేల్పుగా భావిస్తూ స్వామివారి పేరును అత్యంత పవిత్రంగా భావిస్తారు. తమం సంతానానికి మద్దిలేటి, మధన భూపాల్, మాధవ్, మద్దమ్మ, మద్దయ్య, మధుసూదన్ తదితర స్వామివారి పేరును నామకరణం చేస్తుంటారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, మహబూబ్‌నగర్, వైఎస్సార్ కడప జిల్లాల్లో మద్దిలేటి స్వామికి పెద్దఎత్తున భక్తులు ఉన్నారు. వైష్ణవ పుణ్యక్షేత్రంగా దినాదినాదిభివృద్ధి చెందుతున్న మద్దిలేటి నరసింహస్వామి ఆలయ చరిత్రపై కథనం.

స్వామిపై అమ్మవారు విజయం సాధించడంతోనే .....

ఆర్‌ఎస్ రంగాపురం శివారులో కొండ కోనల మధ్య గలగల పారే సెలయేరు పక్కన వెలిశాడు శ్రీ మద్దిలేటి నరసింహస్వామి. మద్దిలేటిస్వామిని మొదటగా కదిరి నరసింహస్వామి అవతారంగా చెప్పుకుంటారు. ఒకరోజు స్వామి, అమ్మవార్లు ఇరువురు ఆనంద సమయంలో పాచికలు ఆడుతున్నారు. స్వామివారిపై అమ్మవారు విజయం సాధించగా విజయగర్వంతో స్వామివారిని హేలనగా చూసినట్లు ప్రచారం ఉంది. స్వామివారు అవమానం భరించలేక ఒక మంచి ప్రశాంత పుణ్యస్థలంలో భక్తుల కోరికలు తీర్చాలని నిర్ణయించుకుంటాడు. ఎర్రమల, నలమల కొండలను సంచరించి చివరకు యాగంటి క్షేత్రం చేరుకుని ఉమామహేశ్వర స్వామివారిని సంప్రదిస్తాడు. ప్రశాంతమైన ఓ మంచి ప్రదేశం చూపించమని ఉమామహేశ్వరస్వామివారిని... నరసింహస్వామి ఆడిగారట. అందుకు ఉమామహేశ్వరుడు మద్దిలేరు వాగుపక్కన ప్రకృతి రమణీయతగల ప్రశాంత వాతావరణం ఉందని చెప్పినట్లు ప్రచారం. నరసింహస్వామి స్వయంభుగా వెలిస్తే గుర్తింపుగా ఉండదని భావించి ఓ భక్తుడి ద్వారా వెలుగొందాలని నిర్ణయించుకున్నాడు. మద్దులేరునకు రెండు కిలోమీటర్ల దూరంలో మోక్ష పట్టణం ఉండేది. ఆ పట్టణాన్ని పరిపాలించే రాజు పేరు కన్నప్ప దొర. ఆ రాజు ప్రతి శనివారం భటులతో వేటకు వెళ్లేవాడు. ఒక రోజు ఎంత తిరిగినా ఒక జంతువుకూడా కనిపించక తిరిగి వస్తుండగా రాజుకు వింతగా తళతళ మెరుస్తూ ఉడుము కనిపించిందని పూర్వీకుల కథనం. రాజాజ్ఞ మేరకు భటులు పట్టుకోవడానికి ప్రయత్నించగా ఉడుం కోమలి అనే పుట్టులోకి వెళ్లింది. భటులు పుట్టను తవ్వినా కనిపించలేదు. అదేరోజు రాత్రి కదిరి నరసింహస్వామి... రాజుకు కలలో కనిపించి పగలు నీకు ఉడుము రూపంలో కనుపించింది నేనేనని స్వామివారు చెబుతాడు. ఆశ్చర్యానికి గురైన రాజు గ్రామంలో ప్రచారం నిర్వహించి భక్తిశ్రద్ధలతో వెళ్లిపూజలు నిర్వహించగా ప్రత్యక్షమైన నరసింహస్వామి కొలిచిన వారి కోరికలు తీరుస్తానని చెప్పి మాయమవుతారు. మద్దిలేరు వాగు పక్కనే వెలసినందున మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంగా పేరొచ్చింది. స్వామివారు సాలగ్రామ స్వరూపుడు, వరహాలుడుగా భక్తుల కోరికలు తీర్చుతూ భక్తుల ఆరాధ్య దైవంగా పేరొందాడు. 2008 ముందు 40 సత్రాలు మాత్రమే ఉండగా ప్రస్తుతం దాతల సహకారం, దేవాదాయశాఖ నిధులతో ఆలయం దినాదినాభివృద్ధి చెందింది. ప్రస్తుతం 200 సత్రాలు, మూడు రాజగోపురాలు సకల సౌకర్యాలతో క్షేత్రం కొత్త శోభను సంతరించుకొంది.



ముక్కోటి ఏకాదశి వేడుకలు ఇలా...

- 21న ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, సాయంత్రం 6గంటలకు, హనుమద్ వాహన సేవ
- 22న శ్రీదేవి, భూదేవి, సమేత మద్దిలేటిస్వామికి ప్రత్యేక పూజలు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గజ వాహనంపై ఊరేగింపు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు.
- 23న పుష్యమాస శుద్ధ ఏకాదశి శనివారం తెల్లవారు జామున 3గంటలకు విష్వక్సేనారాధన. స్నపన తిరుమంజనం. విశేషపుష్పాలంకరణ. ఉదయం 4 గంటలకు భక్తులకు ఉత్తరద్వార దర్శనం, 11:00 గంటలకు శ్రీ భూ, నీలా సమేత ఘణ మద్దిలేటి స్వామి అమ్మవార్లకు శాంతి కళ్యాణత్సోవం.

ముక్కోటి ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి

ముక్కోటి ఏకాదశి రోజున స్వామి వారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి కల్గుతుంది. స్వామి వారి తిరు కళ్యాణం మహోత్సవం దర్శించి వారి వారి యొక్క కర్మలను తీర్చుకొని పరమ పవిత్రులు కావాలన్నారు. వైష్ణవ క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి రోజున నిద్రిస్తే ఏడు వంశాలవారు తరిస్తారు. స్వామివారి కల్యాణం తిలకించడం వలన ఇహపర సుఖములు పొంది చివర వైకుంఠధామం సిద్ధిస్తుంది.

– జ్వాలా చక్రవర్తి, ఆలయ వేదపండితుడు

బండలాగుడు, కబడ్డీ పోటీలు



ముక్కోటీ ఏకాదశి ఉత్సవాలు పురస్కరించంకుని 22న పాల పండ్ల బండలాగుడు, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నాం. అదేవిధంగా 23న రాష్ట్ర స్థాయి న్యూకేటగిరి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. అలాగే నాటక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. భక్తులు ఉత్సవాలకు పెద్ద ఎత్తున్న హాజరై విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

– ఆలయ ఈఓ. పాండు రంగారెడ్డి

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



ముక్కోటి ఏకాదశి వేడుకల సందర్భంగా ఆలయ సందర్శనకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాం. ఉత్సవాలు ముగిసేంత వరకు ప్రణాళిక మేర ఏర్పాట్లు చేస్తున్నాం. కళ్యాణం రోజు ఆర్‌ఎస్ రంగాపురం నుంచి ఆలయం వరకు ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నాం.

– ఆలయ చైర్మన్ సీతారామ చంద్రుడు

మంత్రి బుగ్గన చొరవతో ఆలయానికి మహర్దశ



పునరుద్ధరించిన స్వామి, అమ్మవార్ల ఆలయాలు

మంత్రి బుగ్గన చొరవతో ఆలయానికి మహర్దశ వచ్చింది. దాదాపు రూ. 2.50 కోట్లతో అమ్మవారి ఆలయ పునరుద్ధరణ పనులు 2020 జూన్‌లో పూర్తయ్యాయి. 12వ తేదీన పునఃప్రారంభించారు. రూ,7.40 కోట్లతో భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న 72 గదులు కాటేజీ నిర్మాణం తోపాటు ఆలయానికి రూ.9,50 కోట్లతో డబుల్ రోడ్డు పనులు పూర్తై భక్తుల కు సౌకర్యంగా మారింది. 3.90 కోట్లతో స్వామి ఆలయ పుణఃరుద్ధరణ తో ఆలయం ఆకర్షణీయంగా ఉంది. ఆలయంలో బైపాస్ రోడ్డు నుంచి స్వామి వారి చెంతకు సుమారు రూ.2 కోట్లతో సీసీ రోడ్డు వేశారు. ఆర్‌ఎస్ రంగాపురం వద్ద నూతనంగా రూ.1.50 కోటితో ఆర్చీ గేటును ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా రూ.12.70 కోట్లతో అమ్మవారి, స్వామి వారి ఆలయం చుట్టూ శ్రీ చక్రం ఆకారంలో మహా ప్రకారం , మండపం, మూడు రాజగోపురాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ. 3కోట్లతో గెస్ట్ హౌస్, మరో రూ. 3 కోట్లతో ఆలయ పరిసరాలను విద్యుత్ సుందరీకరణ చేసి ఆకర్షణీయంగా ఉంచడమే కాకుండా, ఆర్కిటెక్ బృందం సభ్యుల సూచన మేరకు మాస్టార్ ప్లాన్‌తో నిర్మాణాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏటేటా ఆలయం ఆదాయం పెరిగి ప్రస్తుతం రూ. 8.50 కోట్లకు చేరుకుంది.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి




సచివాలయ ఉద్యోగులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న నగర పంచాయతీ చైర్మన్, కమిషనర్

బేతంచెర్ల: యువతి,యువకుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు రాష్ట ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని 6 గ్రామ సచివాలయాలకు ఆడుదాం ఆంధ్రా పోటీల క్రీడా పరికరాలను వారు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకు లు దస్తగిరి, ఇస్మాయిల్, ఫిరోజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల: పట్టణంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం శ్రీనగర్ కాలనీలోని షాదీఖానా వరకు డ్రైనేజి కాల్వ ఏర్పాటు చేయాలన్న ముస్లిం సోదరుల విన్నపం మేరకు షాదీఖాన వద్ద చలం రెడ్డి ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా, నగర పంచాయతీ సిబ్బందితో చర్చించారు. కొలుములపల్లె రహదారిలో వేస్తున్న డబుల్ రహదారి ప్రక్కన్న ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పు చేయాలని ఏఈ మహబూబ్ వలి చైర్మన్ సూచించారు.

పశువుల దాణా పంపిణీ



దాణాను పంపిణీ చేస్తున్న గోవిందనాయక్

బనగానపల్లె : పాడి రైతులు పశువుల దాణాను సద్వినియోగం పరచుకొని పాల ఉత్పత్తిని పెంచాలని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ గోవిందనాయక్ కోరారు. మంగళవారం స్థానిక పశువైద్యశాలలో ఏడీఏ మారుతిసకారమ్ ఆధ్వర్యంలో ఆయన రైతులకు సంపూర్ణ మిశ్రమ దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవిందనాయక్ మాట్లాడుతూ బనగానపల్లె మండలానికి 20 టన్నుల టీఎంఆర్ పశువుల దాణాను పంపిణీ చేశామన్నారు. వ్యవసాయంతో పాటు రైతులు పాడి పోషణలో రాణించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం పశువులకు కూడ హెల్త్‌కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ఏడీఏ కేవీ బ్రహ్మం, పశువైద్యులు రామ్‌కుమార్‌రెడ్డి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఖురేష పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకు టీడీపీ కుట్రలు

- ఆచరణకు యోగ్యమవ్వని టీడీపీ హామీలు
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : ప్రజలను మభ్యపెట్టేందుకు టీడీపీ కుట్రలు పన్నుతోందని, ఆచరణకు యోగ్యం కాని హామీలు గుప్పిస్తుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎలాగైనా అధికారం చేజిక్కించుకునేందుకు టీడీపీ నాయకులు భూటకపు వాగ్దానాలకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం మండలంలో కన్నపకుంట నుండి కమలాపురం గ్రామం వరకు రూ.3కోట్లతో నిర్మించిన తారురోడ్డును జెడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం కన్నపకుంట నుండి పాదయాత్రగా కమలాపురం గ్రామం చేరుకొని రూ.35.5 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.25 లక్షలతో నిర్మించిన ఆర్‌బికే కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డోన్ మండలం కమలాపురంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ అర్జున్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి ప్రసంగించారు. 2014 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలే కపోయిందన్నారు. రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు వడ్డీ మాఫీ, అక్కా, చెల్లెమ్మలకు పసుపు కుంకుమ కింద ఆర్థిక సాయం, ఉచితంగా మూడు సిలిండర్లు అంటూ ఆకర్షణీయంగా అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన నారా చంద్రబాబునాయుడి ప్రభుత్వం అవేవీ నెరవేర్చకపోవడంతో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి 2019 ఎన్నికల్లో ఇంటికి సాగనంపిన విషయాన్ని మరిచిపోవద్దన్నారు. బాబు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ అధికారం నిలబెట్టుకున్నారని విమర్శించారు. మామ ఎన్‌టీఆర్‌నే వెన్నుపోటు పొడిచి అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఘనత బాబుకే దక్కిందని ఎద్దేవా చేశారు.

సుపరిపాలనే లక్ష్యంగా....

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా గ్రామ, సచివాలయాల వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యన ఉండే దళారీ వ్యవస్థను రూపుమాపారని మంత్రి బుగ్గన గుర్తు చేశారు. తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ఎలాంటి అవినీతికి తావు లేని పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకురావడమే కాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులందరికీ రాజకీయ రిజర్వేషన్ల ద్వారా అనేక నామినేటెడ్ పదవులు అందించారని గుర్తుచేశారు.

అన్నిరంగాల్లో అభివృద్ధి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించి తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని ప్రజలను కోరారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ రామక్రిష్టారెడ్డి, డీఈ నాగిరెడ్డి, ఏఈ నారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్‌వర్దన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డీఓ వెంకటరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు


- ప్రతి కుటుంబానికి లబ్ధి.. పేదలందరికీ న్యాయం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాన ప్రాధాన్యతనిస్తున్నారని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ పేదలందరికీ న్యాయం చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని, పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని ఐదవ సచివాలయం పరిధిలోని కొలిమిపేట, కటికపేట, శివాలయం వీధి, తెలుగుపేట కాలనీల్లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన తీరును వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాలు బుక్‌లెట్‌లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల వద్దకే పాలన సాగిస్తున్నారన్నారు. అర్హత ఉంటే చాలు సచివాలయంలో సంప్రదిస్తే... ఏ ఒక్కరి సిఫారుసు అక్కరలేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని గుర్తు చేశారు. గత టీడీపీ పాలనలో రేషన్‌కార్డు, పింఛన్ తదితర పథకాల మంజూరు కోసం జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి ఉండేదని, అయినా న్యాయం జరుగుతుందనే భరోసా ఏ మాత్రం ఉండేది కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య ఆర్‌డబ్ల్యూఎస్ సాయికృష్ణ హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, జెడ్పీటీసీ సుబ్బలక్ష్మమ్మ, ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య, భానుముక్కల సహకారం సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు, బూత్ కమిటీ కన్వీనర్ శివవరం మధుసూదన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కిశోర్, రవికుమార్ రెడ్డి, రహీమాన్, సజ్జాద్, చాంద్, మూర్తుజా, నాగేంద్ర, మద్దయ్య శ్రీరాములు, బాలు, కంబగిరి, వెంకట రెడ్డి, జీటి వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం




రూ.1.53కోట్లతో నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్యలేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని రవ్వలకొండపై జల్‌జీవన్ పథకం కింద రూ.1.53 కోట్లతో 2.50లక్షల లీటర్ల సామర్థ్యం నిర్మించిన ఓహెచ్ ఆర్ ట్యాంకును ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రవ్వలకొండ, ఎన్జీవో కాలనీల్లో రెండు ట్యాంకులను ఒక్కొక్కటి 2.50లక్షల నీటి సామర్థ్యం ట్యాంకులు మొత్తం రూ.2,72 కోట్లతో నిర్మించామని గుర్తు చేశారు. ఏళ్లతరబడి నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి ఏఈ సాయికృష్ణ, ఈఓ ఖలీల్ డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, ఎంపీటీసీ సభ్యులు వెంకటసుబ్బయ్య, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జనార్దన్ రెడ్డి, నాయకులు జీటి వెంకట్రామిరెడ్డి, రామచంద్రారెడ్డి, సురేష్, శ్రీరాములు మూర్తుజా పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

డోన్ టౌన్ : స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి,గోదేవీ,భూదేవి ఉత్సవ మూర్తుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. కల్యాణం,మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీకుమారి, శ్రీనివాసలు, గోవింద మాలదీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో : ఇందిరానగర్‌లో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు విజయశర్మ,లక్ష్మినారాయణశర్మ ఆధ్వర్యంలో హనుమాన్ మాలదీక్షాపరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తికి హోమాలు, అర్చనలు, భజనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిత్రం స్వామి వారికి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.



ప్రత్యేక రైన్ ఫాల్ గేజ్ ఏర్పాటు చేయాలి

అవుకు: మండల పరిధిలోని కొండమీది గ్రామాలైన మంగంపేట తాండా, మంగంపేట, కునుకుంట్ల, మన్నేనాయక్‌తాండా, ఇస్రానాయక్‌తాండా, మర్రికుంటతాండా, ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయునిపల్లె, పిక్కర్లపల్లితాండా, మారేమడుగుల గ్రామాలకు సంబంధించి రైన్‌ఫాల్ గేజ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. మండలం మొత్తానికి ఒక్కటే రైన్ ఫాల్ గేజ్ మండల కేంద్రంలో అవుకులో ఉండడం మూలంగా కొండమీది గ్రామాల్లో వర్షాలు పడకపోయిన మొత్తానికి కలిపి వర్షపాతం నమోదు తెలుపుతున్నారన్నారు. దీంతో కొండమీది పల్లెల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల రైతులు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు సైతం వినతి పత్రం అందజేశారని, అధికారుల స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మండలాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా

ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో అవుకు మండలం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నామని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి పేర్కొరన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి సమస్యను విన్నవించగా అవుకు పట్టణాదనికి 5 అంగన్‌వాడీ భవనాలకు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఎంపీ నిధులతో రూ.20లక్షలతో ఉప్పలపాడులో, రూ.10లక్షల తో జూనూతల గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులకు రూ.5లక్షలను మండల పరిషత్ నిధుల ద్వారా పూర్తి చేస్తామన్నారు. గడపగడప నిధులతో పట్టణంలో ప్రాధాన్యతను బట్టి సీసీ రోడ్ల నిర్మాణాలు పారంభిస్తామని తెలిపారు.

డోన్‌కు చేరిన బాలరాముని రథ యాత్ర

డోన్ టౌన్ : తిరుమల తిరుపతి నుంచి అయోధ్యకు వెళ్తున్న శ్రీబాలరాముని రథ యాత్ర మంగళవారం సాయిత్రం డోన్ పట్టణం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఇందిరానగర్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా మేళతాళాలతో బాణా కాలుస్తూ వైభవంగా రథ యాత్ర కొనసాగింది. హనుమాన్‌మాల దీక్షా పరులు, వివేకానంద సేవా సమితి సభ్యులు, పట్టణ ప్రజలు, మహిళలు స్వామివారిని దర్శించుకున్నారు. జై శ్రీరాం నామం మారుమోగింది.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మౌలిక వసతుల కల్పనకు రూ.6.40కోట్లు

డోన్ : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో పట్టణాభివృద్ధికి ప్రభుత్వం స్పెషల్ గ్రాంట్ కింద రూ.6.40కోట్లు మంజూరు చేసిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఈ నిధులతో పట్టణ పరిధిలోని 32 వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. స్థానిక 30, 31వ వార్డుల్లోని ఇందిరానగర్ నుంచి శ్రీరామ థియేటర్‌కు వెళ్లే రహదారి నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. సీఎండీఎఫ్ నిధుల కింద రూ.60లక్షలతో ఈ రహదారి నిర్మాణం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, కుళ్లాయప్ప, పాలుట్ల రఘురాం, మేకల విమల, వైఎస్సార్‌సీపీ నాయకులు వంశీ, డీలర్ క్రిష్ణ పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్